క్షయ పట్ల అప్రమత్తత అవసరం

రాష్ట్ర టిబి జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రమేష్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

క్షయ వ్యాధి పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర టిబి జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ సూచించారు. మండలంలోని గొల్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని క్షయ వ్యాధిగ్రస్తులను ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని, వ్యాధి లక్షణాలు ఉంటే వెంటనే దగ్గరలో ఉన్న ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిబి క్లినిక్ వైద్యాధికారి ఎ.దుర్గాభవాని, గొల్లపల్లి వైద్యాధికారి డాక్టర్ పి.శ్రీనివాస్ గౌతమ్, టిబి క్లినిక్ సిబ్బంది, వైద్య సిబ్బంది శ్రీనివాస్, హెల్త్ సూపర్‌వైజర్, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'కోడ్' లేదు.. సలాంలే..!

టిడిపి అభ్యర్థి నామినేషన్‌లో నిబంధనలు బేఖాతరు
కలెక్టరేట్ గేటు వరకూ వందలాది మంది టిడిపి నేతలు, కార్యకర్తలు
కలెక్టరేట్ లోపలికి మంత్రులు, ఎంఎల్‌ఎలు, అనుచరులు 22 మందిపైనే
ప్రభుత్వ అధీనంలోని ఇండోర్ స్టేడియంలో వేలాది మందికి భోజనాలు
సలాం కొడుతూ చేతులెత్తేసిన పోలీసులు, అధికారులు

కలెక్టరేట్ గేటు వద్దకు చేరుకున్న కూటమి నాయకులు, కార్యకర్తలు

ముగ్గురితో నామినేషన్ వేసేందుకు వెళ్తున్న పిడిఎఫ్ అభ్యర్థి రాఘవులు (ఫైల్)

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అధికార పార్టీ ఎంఎల్‌సి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం నామినేషన్ ప్రక్రియలో పోలీసులు, అధికారులు సలాం కొడుతూ, ఎన్నికల నిబంధనలను గాలికొదిలేశారు. ఎన్నికల నిబంధనలకు పాతరేస్తూ మంత్రులు, ఎంఎల్‌ఎలు, టిడిపి నేతలు వ్యవహరించిన తీరు అందరినీ విస్మయానికి గురిచేసింది. ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి కూటమి అభ్యర్థిగా పేరాబత్తుల రాజశేఖరం సోమవారం నామినేషన్ వేశారు. ఈ నామినేషన్ ప్రక్రియలో అడుగడుగునా ఎన్నికల కోడ్ ఉల్లంఘన సాగింది. నిబంధనలు ఇతర పక్షాలకేనని, అధికారపక్షానికి వర్తించవు అన్నట్లుగా పోలీసులు, అధికారులు చేతులెత్తేసిన కన్పించింది. స్థానిక ఆమీనాపేటలోని టిడిపి కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. నిబంధనల ప్రకారం నామినేషన్ వేసే కలెక్టర్ కార్యాలయానికి వంద మీటర్ల దూరం వరకు మాత్రమే నాయకులు, కార్యకర్తలకు అనుమతి ఉంటుంది. అక్కడి నుంచి అభ్యర్థితోపాటు మరో నలుగురిని మాత్రమే కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు అనుమతిస్తారు. ఇప్పటి వరకూ నామినేషన్లు వేసిన అభ్యర్థులంతా ఇదే నిబంధనలు పాటించేలా పోలీసులు కట్టుదిట్టంగా వ్యవహరించారు. చివరి రోజు సోమవారం అధికారపక్ష అభ్యర్థి విషయంలో నాయకులను అదుపు చేయకుండా పోలీసులు చేతులెత్తేశారు. వంద మీటర్ల వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లను దాటి కలెక్టరేట్ గేటు వద్దకు సుమారు 500 మంది కార్యకర్తలు, నాయకులు చేరుకున్నారు. గేటుదాటి కలెక్టరేట్‌లోకి దాదాపు 22 మంది వరకూ వెళ్లిన పరిస్థితి ఉంది.

నిబంధనలు బేఖాతరు చేసిన మంత్రులు, ఎంఎల్‌ఎలు

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, ఏలూరు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు, కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి రాధాకృష్ణయ్య (చంటి)తోపాటు గోదావరి జిల్లాలకు చెందిన పలువురు ఎంఎల్‌ఎలు ఎన్నికల నిబంధనలను ఏమాత్రం పట్టించుకోలేదు. వంద మీటర్ల వద్ద నాయకులను, కార్యకర్తలను అదుపుచేయాల్సిన పోలీసులు ప్రేక్షకపాత్రకు పరిమితమయ్యారు. డిఎస్‌పి స్థాయి అధికారి సైతం ఏమీ చేయలేకపోయారు. కలెక్టరేట్ గేటు దాటి 20 మందికిపైగా లోపలికి వెళ్లడంతోపాటు నిబంధనలకు విరుద్ధంగా ప్రయివేట్ ఫొటోగ్రాఫర్లు కలెక్టరేట్ కాంపౌండ్‌లో డ్రోన్ కెమెరా ఎగరవేసినప్పటికీ పోలీసులు మౌనంగా ఉండిపోయారు. ఒక ఎఎస్‌పి, ఒక డిఎస్‌పి స్థాయి అధికారులతోపాటు పలువురు సిఐలు, ఎస్ఐలు ఉన్నప్పటికీ ఎన్నికల నిబంధనలను అమలు చేయడంలో విఫలమయ్యారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా పార్టీ కార్యక్రమాలకు ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాలు ఉపయోగించుకోకూడదని నిబంధనల్లో ఉంది. అయినప్పటికీ ఇండోర్ స్టేడియం మైదానంలో సుమారు ఆరు వేల మందికి భోజన ఏర్పాట్లు చేయడం గమనార్హం. జిల్లా పరిషత్ కార్యాలయం ఆవరణలోని నిర్మాణంలో ఉన్న భవనంలో మాజీ ఎంఎల్‌ఎ బడేటి చంటి ఫొటోతో కూడిన ఫ్లెక్సీలు పెట్టి మరీ అల్పాహారం, భోజనం ఏర్పాట్లు చేయడం గమనార్హం. టిడిపి కార్యాలయం వద్ద రోడ్డుపై ఫ్లెక్సీలు నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేయడం చూస్తుంటే నిబంధనలు అధికార పక్షానికి వర్తించవా అనే ప్రశ్న తలెత్తుతోంది. మూడు రోజుల క్రితం పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి డి.రాఘవులు నామినేషన్ కార్యక్రమంలో అనేక ప్రజాసంఘాల నాయకులు ర్యాలీగా పాల్గొన్నప్పటికీ కేవలం ఐదుగురిని మాత్రమే కలెక్టరేట్‌లోకి పంపించారు. ఈ నిబంధన అధికార పార్టీ అభ్యర్థికి ఎందుకు అమలు చేయలేకపోయారో ఉన్నతాధికారులే చెప్పాలి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ఎన్నికల నియమావళి కచ్చితంగా అమలయ్యేలా చూడాలని అంతా కోరుతున్నారు.

ఇండోర్ స్టేడియంలో భోజనాలు

జెడ్‌పిలో మాజీ ఎంఎల్‌ఎ బడేటి బుజ్జి ఫ్లెక్సీలతో చేసిన భోజన ఏర్పాట్లు



కలెక్టరేట్‌లో డ్రోన్

ముగిసిన నామినేషన్ల పర్వం

పట్టభద్రుల ఎంఎల్‌సి నామినేషన్లకు ముగిసిన గడువు
మొత్తం 59 మంది అభ్యర్థులు, 72 నామినేషన్లు
నేడు నామినేషన్ల పరిశీలన.. 13 వరకూ ఉపసంహరణకు గడువు
27న ఎన్నికలు, 3న కౌంటింగ్
పిడిఎఫ్, టిడిపి అభ్యర్థుల మధ్యే ప్రధాన పోటీ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల నామినేషన్ల పర్వం సోమవారంతో ముగిసింది. జనవరి 29న ఎంఎల్‌సి ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. ఫిబ్రవరి మూడో తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. అదేరోజు నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. పదోతేదీ సోమవారం సాయంత్రం నామినేషన్ల స్వీకరణ ముగిసింది. ఎంఎల్‌సి ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి నామినేషన్లను స్వీకరించారు. నామినేషన్ల గడువు ముగిసేసరికి మొత్తం 59 మంది అభ్యర్థులు 72 సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. కొంతమంది అభ్యర్థులు రెండేసి చొప్పున నామినేషన్లు దాఖలు చేశారు. ఏడో తేదీ శుక్రవారం, చివరిరోజు సోమవారం అత్యధిక నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ల స్వీకరణ ముగియడంతో 11వ తేదీ మంగళవారం నామినేషన్ల పరిశీలన జరగనుంది. నామినేషన్ల ఉపసంహరణకు 13వ తేదీతో గడువు ముగియనుంది. ఉపసంహరణల గడువు ముగిసిన తర్వాత బరిలో ఎంతమంది నిలిచారో అభ్యర్థుల జాబితా తేలనుంది. ఈ నెల 27వ తేదీ ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ పోలింగ్ జరగనుంది. మార్చి మూడో తేదీన కౌంటింగ్ ప్రక్రియ ఏలూరులో నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల్లో మొత్తం 3,15,261 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. మొత్తం 440 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. అవసరాన్ని బట్టి పోలింగ్ కేంద్రాల పెంపునకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

నామినేషన్ పత్రాలు అందిస్తున్న కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం

పిడిఎఫ్, టిడిపి అభ్యర్థుల మధ్యే ప్రధాన పోటీ

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో పిడిఎఫ్ బలపరిచిన అభ్యర్థి దిడ్ల వీర రాఘవులు, టిడిపి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం మధ్యే ప్రధాన పోటీ ఉండనుంది. నిరుద్యోగులు, ఉద్యోగ, కార్మికులంతా పిడిఎఫ్ అభ్యర్థికి మద్దతు తెలుపుతున్నారు. టిడిపి తన అధికార బలాన్ని ఉపయోగించి ఎంఎల్‌సి ఎన్నికల్లో గెలుపొందాలని చూస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మంత్రులు, ఎంఎల్‌ఎలు, స్థానిక నాయకులంతా తమ సర్వశక్తులు ఒడ్డుతున్న పరిస్థితి ఉంది. టిడిపి అభ్యర్థి నామినేషన్ రోజున నిబంధనలు లెక్కచేయకుండా ముందుకు సాగడంతో ఎన్నికలు దగ్గర పడే కొద్దీ పరిస్థితి ఎలా ఉంటుందోననే చర్చ సర్వత్రా సాగుతోంది. ఏదేమైనా ఎంఎల్‌సి ఎన్నికలు రసవత్తరంగా సాగే పరిస్థితి కన్పిస్తోంది.

వినతిపత్రాలు చూపుతున్న అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు

నేడు, రేపు మన్యం బంద్

ఆదివాసీ గిరిజన సంఘాల జెఎసి ఆధ్వర్యాన విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

1/70 చట్టం, అటవీ హక్కుల చట్టాల్లో సవరణలు చేయాలన్నా స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలను నిరసిస్తూ ఈ నెల 11, 12 తేదీల్లో 48 గంటల ఏజెన్సీ బంద్‌ను జయప్రదం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన మండలంలో సోమవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ ఆదివాసీ ప్రాంతాల్లో టూరిజం అభివృద్ధికి గిరిజనుల హక్కులు కాలరాస్తారా అని ప్రశ్నించారు. 1/70 చట్టం సవరణ చేయాలనడం ఆదివాసీలకు తీరని ద్రోహం చేయడమేనన్నారు. అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలు వ్యక్తిగతమా, కూటమి ప్రభుత్వ ఆలోచనా అనేది స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన చట్టాల నిర్వీర్యానికి ప్రయత్నిస్తే ఉద్యమం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోలోజు నాగేశ్వరరావు, కుంజం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తెల్లం రామకృష్ణ

పోలవరం: ఈ నెల 11,12 తేదీలలో మన్యం బంద్ విజయవంతం చేయాలని ఏజెన్సీ గిరిజన సంఘం అధ్యక్షులు ఇల్లా రామిరెడ్డి, కార్యదర్శి కుంజం రామారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయడంతోపాటు పీసా, అటవీ హక్కుల చట్టం వంటి అన్ని ఆదివాసీ చట్టాలను యథాప్రకారం అమలు చేయాలని కోరారు.

మన్యం బంద్‌కు సిపిఎం మద్దతు

ఏలూరు అర్బన్ : ఈ నెల 11, 12 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా తలపెట్టిన ఏజెన్సీ ప్రాంత బంద్‌కు సిపిఎం సంపూర్ణ మద్దతిస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1/70 చట్ట సవరించాలనే స్పీకర్ వ్యాఖ్యలను నిరసిస్తూ, జిఒ నెం.3ను పునరుద్ధరించాలని, గిరిజనుల హక్కులను పరిరక్షించాలని కోరుతూ రెండు రోజులపాటు ఏజెన్సీ మండలాల్లో ఆదివాసీ గిరిజన సంఘాల జెఎసి ఆధ్వర్యంలో జరిగే బంద్‌లో సిపిఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొని సహకరిస్తారని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో 1/70 చట్టం జీవనాడిగా ఉందని, అటువంటి చట్టాన్ని సవరించి గిరిజనులకు చెందాల్సిన భూములను గిరిజనేతర భూస్వాములకు అన్యాక్రాంతం చేసేందుకు, కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టేందుకు ప్రయత్నంగా కన్పిస్తోందని విమర్శించారు. స్పీకర్ బేషరతుగా ఈ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని, క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం 1/70 చట్టం ఉండగానే ఏజెన్సీ మండలాలైన పోలవరం, బుట్టాయిగూడెం, జీలుగుమిల్లిల్లో దాదాపుగా 55 వేల ఎకరాల భూములు అన్యాక్రాంతమైనట్లు 15 ఏళ్ల క్రితం అసెంబ్లీలో అప్పటి గిరిజన సంక్షేమ శాఖ మంత్రి రెడ్యానాయక్ ప్రకటించారని గుర్తు చేశారు. 1/70 చట్టం ఉండగానే గిరిజనులకు చెందాల్సిన భూములు గిరిజనేతర భూస్వాములకు అన్యాక్రాంతమవుతున్నప్పుడు ఈ చట్టం లేకుండా చేస్తే మొత్తం భూములన్నీ గిరిజనేత భూస్వాముల స్వాధీనమవుతుందని, ఆ విధంగా గిరిజనేతర భూస్వాములకు మేలు చేసేలా అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజన హక్కులను ఉపయోగించుకుని, గిరిజన కోటాలో ఈ ప్రాంత ఎంఎల్‌ఎగా గెలిచిన చిర్రి బాలరాజు ఈ వ్యాఖ్యలపై మౌనంగా ఉండటం బాధాకరమని పేర్కొన్నారు. పోలవరం ఎంఎల్‌ఎ కూడా గిరిజనేతర భూస్వాములతో మీటింగులు పెట్టి గిరిజనుల కోసం పోరాడుతున్న, గిరిజనులకు న్యాయం జరిగేలా కోర్టులో కేసులు వేస్తున్న వారు కేవలం డబ్బుల కోసమే ఈ పోరాటాలు చేస్తున్నారని తప్పుడు ఆరోపణ చేస్తున్నారని, రౌడీషీట్లు పెడతామని బెదిరించే రీతిలో మాట్లాడుతున్నారని వార్తలు వస్తున్నాయని, ఇది చాలా అన్యాయమని, ఈ వైఖరిని సిపిఎం ఖండిస్తోందని పేర్కొన్నారు.

జీతాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలి

రాష్ట్రపతి ద్రౌపదిముర్ముకు వినతిపత్రాలు పంపుతాం
అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు

ప్రజాశక్తి - పోలవరం

అంగన్వాడీలకు జీతాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని అఖిల భారత అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పోలవరం పంచాయతీ జగన్నాథపేటలో అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు సోమవారం సంతకాలు చేపట్టారు. ఈ సందర్భంగా తమ సమస్యలను భారత రాష్ట్రపతి ద్రౌపదిముర్మకు వినతిపత్రాలు పంపనున్నట్లు అంగన్వాడీలు తెలిపారు. అంగన్వాడీలు, హెల్పర్లు వినతిపత్రాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2015 గుజరాత్ హైకోర్టు తీర్పు ప్రకారం ఏడో పే కమీషన్ ప్రకారం కనీసవేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం వడ్డీతో సహా గ్రాట్యుతో చెల్లించాలని కోరారు. ఆరేళ్ల లోపు వయసు పిల్లలకు శిశు సంరక్షణ, విద్యాభివృద్ధిని కట్టుదిట్టంగా అమలు జరిపే విధంగా చట్టం చేయాలని, అందుకు తగిన నిధులు బడ్జెట్‌లో కేటాయించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ పిఎల్ఎస్.కుమారి, సత్యవేణి, సరస్వతి, భారతి, వర్కర్లు, పాల్గొన్నారు.

బయోమెట్రిక్ విధానంలో ఎరువులను విక్రయించాలి

నూజివీడులో ఇంటర్నల్ స్క్వాడ్ తనిఖీలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఎరువుల డీలర్లందరూ ఇ-పాస్ మిషన్ ద్వారా బయోమెట్రిక్ విధానంలో ఎరువులను విక్రయించాలని వ్యవసాయ సహాయ సంచాలకులు కోట రామచంద్రపురం, బుజ్జిబాబు సూచించారు. మండలంలో ఇంటర్నల్ స్క్వాడ్ తనిఖీలను వారు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూజివీడు మండల ఎరువుల డీలర్లకు సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. అనంతరం బుజ్జిబాబు మాట్లాడుతూ ఎరువుల డీలర్లందరూ ఇ-పాస్ మిషన్ ద్వారా బయోమెట్రిక్ విధానంలో ఎరువులను విక్రయించాలన్నారు. ఎరువుల ధరలు స్టాక్ నిల్వలు రైతులకు కనపడే విధంగా ప్రదర్శించాలన్నారు. డీలర్లందరూ ఆధీకృత డిస్ట్రిబ్యూటర్ల ద్వారా పొందిన స్టాక్‌లను విక్రయించే విధంగా రైతుకు బిల్లు ఇవ్వాలని తెలిపారు. ఎఫ్‌సిఒ 1985 నిబంధనలను అనుసరించి డీలర్లు స్టాక్ రిజిస్టర్, బిల్లు పుస్తకాల నిర్వహణ సక్రమంగా ఉండాలని తెలిపారు. అనంతరం నూజివీడులోని భాస్కర ఫెర్టిలైజర్, పెస్టిసైడ్స్ దుకాణంలో రికార్డులను పరిశీలించి, ఎరువుల గోడౌన్‌లో స్టాక్ నిల్వలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎరువుల డీలర్లు, మండల వ్యవసాయాధికారి ఎ.చాముండేశ్వరి పాల్గొన్నారు.

దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఇంటర్నల్ స్క్వాడ్

అందుబాటులోకి సి-ఆర్మ్ ఫ్లోరోస్కోప్ ఎక్స్‌రే మెషిన్

ఏలూరు సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎంఎస్.రాజు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో నూతనంగా సి - ఆర్మ్ ఫ్లోరోస్కోప్ ఎక్స్-రే మెషిన్‌ను సోమవారం ఆసుపత్రి సూపరింటెండెంట్, అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ ఎంఎస్.రాజు, ఇతర వైద్యులు ఆవిష్కరించి రోగుల కోసం వినియోగంలోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ ప్రస్తుతం ఇది ఎముకల శస్త్రచికిత్సలకు, వెన్నెపూస శస్త్రచికిత్సలకు ఉపయోగపడుతుందని, ఆపరేషన్ సమయంలోనే వాస్తవకాలంలో ఎముకల దృశ్యాలను చూసి అప్పటికప్పుడే సరిచేయవచ్చని తెలిపారు. ప్రస్తుతం రోజుకు ఐదు నుంచి పది మంది రోగుల శస్త్రచికిత్సల్లో వినియోగించవచ్చని, భవిష్యత్తులో గుండె, ఇతర నిపుణులు వచ్చినప్పుడు గుండె జబ్బుల నిపుణులు దీనిని కేత్ -ల్యాబ్‌లో గుండె రక్తప్రసారణ లోపాలు కని పెట్టడానికి చేసే ఆంజియోగ్రామ్స్ పరీక్ష ల్లోను, స్టెంట్స్ వేయడంలో కూడా ఉపయోగించవచ్చన్నారు. రక్త నాళాల నిపుణులు రక్తనాళాల్లో అడ్డంకులు కనిపెట్టి అవి తొలగించడానికి కూడా వాడవచ్చని, గ్యాంగ్రీన్, సిరలలో థ్రోంబోసిస్ ఉన్న రోగుల చికిత్సకు ఉపయోగపడుతుందని, పేగుల నిపుణులు కూడా ఈ పరికరాన్ని అన్నవాహిక, క్లోమగ్రంధి పరీక్షలకు వాటి వైద్యానికి ఉపయోగించవచ్చని తెలిపారు. ఏలూరు చుట్టుపక్కల ప్రజలకు ఈ పరికరం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, దీని ఖరీదు సుమారు రూ.40 లక్షలు అని, ఇది ఏలూరు సర్వజన ఆసుపత్రిలో ఉన్న రెండో సి-ఆర్మ్ పరికరమని చెప్పారు. ఇంతకు ముందు ఉన్న సి-ఆర్మ్ పరికరం పాతది అయి పదే పదే మరమ్మతులకు గురవ్వడంతో ఈ కొత్త అత్యాధునిక పరికరం తెప్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వంశీ, డాక్టర్ ధన్యశ్రీ, మత్తు విభాగాధిపతి డాక్టర్ హేమలత, ఎముకల శస్త్రచికిత్స విభాగాధిపతి డాక్టర్ నాగరాజు, మత్తు వైద్యులు శివరాం, డాక్టర్ విజయ్, నర్సింగ్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి, హెడ్ నర్స్ పద్మ, బయో మెడికల్ ఇంజినీర్ రాజ్‌కమల్ పాల్గొన్నారు.

మెషిన్‌ను ఆవిష్కరించిన ఎంఎస్.రాజు, వైద్యులు

పిడిఎఫ్ అభ్యర్థికి జన నీరాజనం

కెఎస్.లక్ష్మణరావు నామినేషన్ దాఖలు
వేలాదిగా తరలి వచ్చిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మిక, ప్రజా సంఘాలు
గుంటూరులో భారీ సభ, ర్యాలీ
ఓటర్ల నుండి మంచి స్పందన వస్తుంది : కెఎస్

ప్రజాశక్తి - గుంటూరు

కృష్ణ-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గానికి ఫిబ్రవరి 27వ తేదీన జరగనున్న ఎంఎల్‌సి ఎన్నికలకు పిడిఎఫ్ అభ్యర్థి, సిట్టింగ్ ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ సందర్భంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, తదితర ప్రజా సంఘాల కార్యకర్తలు వేలాది మంది తరలివచ్చారు. స్థానిక వెంకటేశ్వరా విజ్ఞాన మందిరంలో జరిగిన సభలో దాదాపు 70 సంఘాల నాయకులు పాల్గొని సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎంఎల్‌ఎ మస్తాన్‌వలి, యువజన నాయకులు చందు మద్దతు తెలిపారు. కెఎస్.లక్ష్మణరావుకు నామినేషన్ ఫీజును అంగన్‌వాడీ యూనియన్ నాయకులు అందించారు. అనంతరం వెంకటేశ్వరా విజ్ఞాన మందిరం నుంచి నగరంపాలెం మీదుగా కలెక్టరేట్ వరకూ భారీ ర్యాలీ జరిగింది. తొలుత యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సభలో కెఎస్.విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా తప్పు చేస్తే తప్పని చెబుతూ, మంచి చేస్తే అభినందిస్తూ నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్నామని చెప్పారు. ఎన్నో ఆశలతో ప్రజలు కూటమి ప్రభుతాన్ని ఎన్నుకున్నారని, కానీ ఎనిమిది నెలలకే అసంతృప్తి పెద్ద ఎత్తున వస్తుందన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. రాబోయే కాలంలో 15 వేల పాఠశాలలు మూతపడబోతున్నాయని చెప్పారు. నిరుద్యోగం పెరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో లక్ష్మణరావు వంటి నిజాయితీపరులను ఎన్నుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చట్ట సభల్లో బడా కోటీశ్వరులు పెరిగిపోయారని, మన కోసం మనమే చట్టాలు చేసుకోవాలని చట్ట సభలను కూడా ఆక్రమించారన్నారు. దీంతో ప్రజా సమస్యలు వారు పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. చట్ట సభల్లో ప్రజల కోసం నిలబడే వ్యక్తి లక్ష్మణరావు అని తెలిపారు. ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి మాట్లాడుతూ కెఎస్.లక్ష్మణరావు ఎన్నిక రాష్ట్రానికి చారిత్రాత్మక అవసరం అన్నారు. గ్రాడ్యుయేట్, టీచర్ల ప్రాతినిధ్యం ఉండాల్సిన సీట్లలో కూడా ఇప్పటికే కొన్నింటినీ రాజకీయ పార్టీలు ఆక్రమించాయని, మిగిలిన వాటిని ఆక్రమించాలని చూస్తున్నారన్నారు. ప్రజల గొంతుక మండలిలో వినిపించటానికి పిడిఎఫ్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. జనచైతన్య వేదిక అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ కులం, డబ్బు వంటి ఇతర ప్రలోభాలకు లొంగకుండా ప్రజల కోసం పనిచేసే కెఎస్.లక్ష్మణరావును గెలిపించాలని కోరారు. మాజీ ఎంఎల్‌సి బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్ని ప్రలోభాలకు గురి చేసినా విలువలను కాపాడుకుంటూ పిడిఎఫ్ ఎంఎల్‌సిలు నిజాయితీగా పనిచేస్తున్నామన్నారు. నిజాయితీకి ఓటర్లు పట్టం కట్టాలన్నారు. ఎపి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ కెఎస్.లక్ష్మణరావు ఈ నియోజకవర్గానికే కాకుండా, రాష్ట్రంలో పోరాడే వారందరికీ ప్రతినిధి అని చెప్పారు. ర్యాలీ అనంతరం ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు మీడియాతో మాట్లాడుతూ క్షేత్ర స్థాయి ప్రచారంలో ఓటర్ల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. గ్రాడ్యుయేట్లు, టీచర్లు వారి ప్రాతినిధ్యం కోసం రాజ్యాంగం కేటాయించిన స్థానాల్లోనూ రాజకీయ పార్టీలు పోటీ చేస్తున్నాయని చెప్పారు. 2007లో శాసన మండలి పునరుద్ధరించిన నాటి నుంచి 18 ఏళ్లలో 14 మంది పిడిఎఫ్ ఎంఎల్‌సిలు గెలుపొంది అత్యంత నిజాయితీతో పనిచేస్తున్నామని, భవిష్యత్‌లోనూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు.

నేతల అభివాదం

సభలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి, అవాజ్ రాష్ట్ర కార్యదర్శి చిష్టీ, ప్రయివేట్ టీచర్స్, లెక్చరర్స్, ప్రొఫెసర్స్ అసోసియేషన్ నాయకులు నాగయ్య, ఐలు జాతీయ నాయకులు నర్రా శ్రీనివాసరావు, జిల్లా నాయకులు రమేష్, మెడికల్, సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ నాయకులు కుమార్, జెవివి రాష్ట్ర కార్యదర్శి కుర్రా రామారావు, పాలిటెక్నిక్ కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం నాయకులు స్వాతి, సచివాలయ ఉద్యోగుల సంఘాల సంఘం రాష్ట్ర అధ్యక్షులు అనురాధ, డాక్టర్ వసుంధర, అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకులు సిహెచ్.నాగబ్రహ్మాచారి, సన్ అసోసియేషన్ నాయకులు యశ్వంత్, నర్సింగ్ అసోసియేషన్ నాయకులు స్వచ్ఛంద ప్రసాద్, జెఎల్.అసోసియేషన్ నాయకులు కైలాష్‌నాద్, మేధావుల ఫోరం నాయకులు అవధానుల హరి ఎల్ఐసి ఏజెంట్స్ అసోసియేషన్ నాయకులు గాంధీ, డివైఎఫ్ఐ రాష్ట్ర నాయకులు రామన్న, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్, ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు రవిశంకర్, ఎఐటియుసి నగర అధ్యక్షులు అంజిబాబు, యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు ఎఎన్.కుసుమకుమారి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్ వివిధ సంఘాల నాయకులు పాల్గొని మద్దతు ప్రకటించారు.

భారీ ర్యాలీ..

నామినేషన్ సందర్భంగా నగరంలో భారీ ర్యాలీ చేపట్టారు. అభ్యర్థి కెఎస్.లక్ష్మణరావు, పిడిఎఫ్ మాజీ ఫ్లోర్ లీడర్ వి.బాలసుబ్రహ్మణ్యం, ఎంఎల్‌సిలు ఐ.వెంకటేశ్వరరావు, బి.గోపీమూర్తి, మాజీ ఎంఎల్‌సి బి.నాగేశ్వరరావు తదితరులు ర్యాలీలో అగ్రభాగాన నడవగా, వేలాది మంది కార్యకర్తలు జెండాలు చేతబూని ర్యాలీలో నడిచారు. వెంకటేశ్వరా విజ్ఞాన మందిరం నుంచి కలెక్టరేట్ వరకూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు, వివిధ రంగాల ప్రజలు వేలాది మందితో ర్యాలీ ఉత్సాహంగా సాగింది. డప్పు దరువులకు కార్యకర్తలు నృత్యాలు చేశారు. టపాసులు కాలుస్తూ సందడి చేశారు. కెఎస్‌ను గెలిపించాలంటూ దారి పొడవునా నినాదాలతో హోరెత్తింది. మార్గ మధ్యలో పలు సంఘాల నాయకులు పూలు, మాలలతో స్వాగతం పలికి మద్దతు ప్రకటించారు.

పాఠశాలకు కుర్చీలు, ఫ్యాన్లు వితరణ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని కుశలవ ఇండస్ట్రీస్ ఎమ్.డి.రామకృష్ణ ప్రసాద్ సతీమణి చుక్కపల్లి సుధా అన్నారు. మండల పరిధిలోని ఈదర జిల్లా పరిషత్ హైస్కూల్ ఫ్లెస్‌కు ఆమె చుక్కపల్లి ఛారిటబుల్ ట్రస్టు తరఫున 40 కుర్చీలు, 20 ఫ్యాన్‌లతో పాటు సౌండ్ సిస్టంను వితరణగా అందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు సందెపాము శారద మాట్లాడుతూ దాతలు అందించిన సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు.

ఉపాధి హామీ కూలీలకు పనులు కల్పించాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు వెంటనే పనులు కల్పించాలని బొర్రంపాలెం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త గుండె పాండురంగ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని బొర్రంపాలెంలో ఉపాధి హామీ పనులు జరిగి దాదాపుగా ఆరు నెలలు కావస్తుందని తెలిపారు. అప్పటి నుంచి పనులేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. గత బుధవారం కొండంపాలెంలో ఉపాధి మేట్‌తో పనిని మొదలు పెట్టారని, మరుసటి రోజు నుంచి పని లేదని చెబుతున్నారని తెలిపారు. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి నాటికల్లా ఉపాధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయని పేర్కొన్నారు. అధికారుల అలసత్వంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మండలంలో కొన్ని గ్రామాల్లో ఇప్పటికే పనులు జరుగుతున్నాయని, కాని బొర్రంపాలెం గ్రామంలో పనులు ఎందుకు జరగటం లేదని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి మండలంలో గ్రామ ప్రజలకు ఉపాధి హామీ పనులు కల్పించాలని తెలిపారు.

అనారోగ్యంతో కాకర్లమూడి సర్పంచి మృతి

ప్రజాశక్తి - ఉంగుటూరు

సత్యనారాయణ (ఫైల్)

మండలంలోని కాకర్లమూడి గ్రామ సర్పంచి కాళ్ల నాగ వెంకట సత్యనారాయణ (నాగ పండు) (48) ఆదివారం రాత్రి ఇంటి వద్దనే మృతి చెందారు. తెలుగుదేశం పార్టీకి చెందిన నాగ పండు గ్రామ సర్పంచిగా అనేక సేవలందించారని పలువురు కొనియాడారు. నాగపండు మృతికి ఉంగుటూరు ఎంఎల్‌ఎ ధర్మరాజు, టిడిపి మండల నాయకులు పాతూరి విజయకుమార్, కడియాల రవిశంకర్ సంతాపం తెలిపారు. మండలంలోని పలు గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు నాగపండు మృతదేహాన్ని సందర్శించి తమ సంతాపాన్ని తెలిపి నివాళులర్పించారు. నాగపండు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందారు. పరిస్థితి విషమించి ఆదివారం రాత్రి ఇంటి వద్ద మృతి చెందారు. ఆయన మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. నెలకొన్నాయి. ఎంపిడిఒ జి.రాజమనోజ్, ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, సర్పంచ్‌ల ఛాంబర్ మండలాధ్యక్షుడు పుచ్చకాయల విష్ణుమూర్తి సంతాపం తెలిపారు.

గుర్తింపు కార్డుతో రైతులకు పలు ప్రయోజనాలు

ప్రజాశక్తి - ముసునూరు

గుర్తింపు కార్డుతో రైతులకు పలు ప్రయోజనాలు ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి కె.సూరిబాబు తెలిపారు. గుర్తింపు కార్డుతో వ్యవసాయ సేవలు సులభతరం చేసి పారదర్శకంగా మరింత అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. మండల వ్యవసాయ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు, రాయితీలు, ఇతర వ్యవసాయ సంబంధిత సేవలను పొందడానికి గుర్తింపు కార్డు సంఖ్య అధికారిక గుర్తింపుగా పని చేస్తుందన్నారు. ప్రభుత్వం అందించే పథకాలు నిరవధికంగా పొందేందుకు ఈ సంఖ్య ఉపయోగపడుతుందన్నారు. తదితర పథకాలు నేరుగా పొందే వీలుంటుందన్నారు. సత్వర పరిహారం అందేందుకు ఉపయోగపడుతుందన్నారు. గ్రామంలో రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి రైతు గుర్తింపు సంఖ్య పొందవచ్చన్నారు. ఆధార్ నెంబర్, ఆధార్ అనుసంధానిత ఫోన్ నెంబర్, భూమి రికార్డుల వివరాలు (పట్టాదారు పాస్ బుక్)తో రైతు సేవా సిబ్బందిని కలిసి నమోదు చేయించుకోవాలని తెలిపారు.

యాంటీ ర్యాగింగ్ డే అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - దెందులూరు

సోమవరప్పాడు సెయింట్ జాన్స్ విద్యాసంస్థల్లో యాంటీ ర్యాగింగ్‌డే అవగాహన సమావేశం ర్యాలీ సోమవారం నిర్వహించారు. సెయింట్ జాన్స్ బిఈడి కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ బాల, కెజిఆర్‌ఎల్ కళాశాల ఆంగ్ల విభాగాధిపతి కె.సంపత్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'కూటమి అభ్యర్థిని గెలిపించండి'

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను గెలిపిస్తే ప్రభుత్వానికి, ఉద్యోగులకు మధ్య వారధిలా ఉంటారని, గ్రాడ్యుయేట్స్ అందరూ రాజశేఖరానికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కోరారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కూటమి బలపరిచిన ఎంఎల్‌సి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో పేరాబత్తుల రాజశేఖరం మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో చదువుకున్న విద్యార్థులకు ఇదే ప్రాంతంలో ఉద్యోగ అవకాశాలు కల్పించడంతోపాటు, కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్రమంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేష్, నాదెండ్ల మనోహర్, గొట్టిపాటి రవికుమార్, వాసంశెట్టి సుభాష్, ఎంఎల్‌ఎలు, కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

దొంగల ముఠా అరెస్టు

రూ.23 లక్షల విలువైన సొత్తు స్వాధీనం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏలూరు చుట్టుపక్కల తాళం వేసి ఉన్న ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.23 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలను, బైకును స్వాధీనం చేసుకున్నారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ సోమవారం విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఎస్‌పి తెలిపిన వివరాల ప్రకారం... కొంతకాలంగా ఏలూరు మూడో పట్టణ పరిధిలో, కైకలూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇళ్లల్లో చోటు చేసుకున్న దొంగతనాలపై ఆయా పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో వాహన తనిఖీలు చేస్తున్న మూడో పట్టణ పోలీసులకు ఏలూరు మినీ బైపాస్‌లో కొత్తూరు ఇందిరమ్మ కాలనీలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించారు. ఆ ఐదుగురు ఏలూరు చుట్టుపక్కల ప్రాంతాల్లో గృహాల్లో దొంగతనాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. వారిలో ఒకరు వందకు పైగా కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం దుర్గాపురం గ్రామానికి చెందిన వెంపలి శేఖర్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో మొత్తంగా 105 కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. అతని స్నేహితుడు హైదరాబాద్ జిల్లాలోని నేరేడుమెట్టు ప్రాంతానికి చెందిన కోసూరి శ్రీనివాసరావు 20 కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. వీరిద్దరితో పాటు పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం గునుపూడి గ్రామానికి చెందిన శాఖ మారాజు (ప్రకాష్), అదే ప్రాంతానికి చెందిన పోకల అమ్మిరాజు, గోగుల మండల సాల్మన్ రాజులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 251 గ్రాముల బంగారు ఆభరణాలు, 31 కేజీల వెండి ఆభరణాలు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.23 లక్షలు ఉంటుందని తెలిపారు.

400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని చెక్కపల్లి గ్రామంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ సిహెచ్.అజయ్‌కుమార్‌సింగ్ ఆధ్వర్యంలో సోమవారం దాడి చేశారు. ఈ దాడిలో తాళం గాజు అనే వ్యక్తి ఇంటి వద్ద ఉన్న 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, అతనిని నూజివీడు కోర్టుకు తరలించినట్లు ఎస్‌ఐ అజయ్‌కుమార్‌సింగ్ తెలిపారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ విభాగం కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ విభాగం కోసం సెల్: 83339 88814

నులి పురుగులను నులిమేద్దాం

ఘనంగా జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం
చిన్నారులకు, విద్యార్థులకు మాత్రల పంపిణీ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా సోమవారం రిజర్వ్ పోలీసు లైన్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో పిల్లలకు నులిపురుగుల మాత్రలు పంపిణీ చేశారు. ఈ పంపిణీ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఆర్.మాలిని పాల్గొని మాట్లాడుతూ పిల్లలందరూ ఆరోగ్యంగా ఉండాలని నులి పురుగు మాత్రలు ప్రతి ఏడాది వేయిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బిఎస్‌కె జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ నరేంద్రకృష్ణ, నరసింహారావు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ప్రగతి, జిల్లా మేనేజర్ నరేష్ పాల్గొన్నారు.

చాట్రాయి : మండలంలోని తుమ్మగూడెం ఎంపిపిఎస్ ఉర్దూ పాఠశాలలో సోమవారం జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంపా వెంకట్రావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎం జరీనా, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు వేసినట్లు పిహెచ్‌సి వైద్యాధికారి ఎ.శ్రీనివాసరెడ్డి, ఎంఇఒ బ్రహ్మాచారి తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో, అంగన్వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. సోమవారం అందని విద్యార్థులకు 17వ తేదీన పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణయ్య, వైద్య సిబ్బంది, ఆశాలు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : సీతంపేట బిసి బాలికల సంక్షేమ పాఠశాలలో విద్యార్థినులకు బయ్యన్నగూడెం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ వి.సత్యనారాయణ నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్.సుబ్రహ్మణ్యం, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కునూరు : కుక్కునూరు మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాల బాలికలకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. సర్పంచి రావు మీనా వినోద్ చిన్నపిల్లలకు స్వయంగా మాత్రలు వేశారు. పిల్లలందరూ రెండు పూటలా స్నానం చేయాలని, పరిశుభ్రత పాటించటం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని సూచించారు.

నూజివీడు టౌన్ : నూజివీడు మండల పరిధిలోని గొల్లపల్లిలో శ్రీ అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గొల్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ శ్రీనివాసగౌతమ్ మాట్లాడుతూ పిల్లలకు నులి పురుగుల నివారణ మందులు ఇవ్వటం ద్వారా వారి ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, ఎఎన్ఎం ప్రిస్కిల్లా, అశావర్కర్లు కాసులు, దేవకరుణ పాల్గొన్నారు. 214 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు.

జీలుగుమిల్లి : మండలంలోని అంగన్వాడీ కేంద్రాల్లో ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో విద్యార్థులకు నులి పురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రలను పిహెచ్‌సి సిబ్బంది పంపిణీ చేసినట్లు వైద్యాధికారిణి బి.గాయత్రి తెలిపారు. సోమవారం అందుబాటులో లేని విద్యార్థులకు మళ్లీ ఒక రోజు వేయనున్నట్లు ఆమె తెలిపారు.

టి.నరసాపురం : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు నులి పురుగు నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి డాక్టర్ ఫణీంద్రబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖాధికారులు టి.రామ్మూర్తి, ఎస్.కళ్యాణి, ప్రధానోపాధ్యాయులు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ముసునూరు : మండలంలోని రమణక్కపేట గ్రామంలో నూలి పురుగుల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు ఎండి కరీముల్లా మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశాలు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ముదినేపల్లి : ముదినేపల్లి జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సి వైద్యురాలు శాంతి శ్రీ మాట్లాడారు. విద్యార్థులకు, కిశోర బాలికలకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు.

పోలవరం : మండలంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. బోడిగూడెం గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల, పోలవరం పంచాయతీ కమ్మరగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో, ఎల్ఎన్‌డిపేట ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం పరిధిలో ఆరు సచివాలయాల్లో, హెల్త్ వెల్‌నెస్ సెంటర్ పరిధిలో బాల బాలికలకు నులిపురుగుల మాత్రలు పంపిణీ చేశారు. ఎల్ఎన్‌డి పేట, వింజరం ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం, పోలవరం సామాజిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పాఠశాలలు, జూనియర్ కాలేజీ విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నిఖిల్ మాట్లాడారు.

దెందులూరు : బిఆర్‌డి స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మూడో సంవత్సరం విద్యార్థి బి.శైలజ మాట్లాడింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంఎల్‌సి ఎన్నికల్లో వీర రాఘవులును గెలిపించాలి

యుటిఎఫ్, సిఐటియు నేతలు

ప్రజాశక్తి - కుక్కునూరు

కుక్కునూరు : మాట్లాడుతున్న నాయకులు

ఈ నెల 27వ తేదీన జరిగే గ్రాడ్యుయేషన్ ఎంఎల్‌సి ఎన్నికల్లో వీరరాఘవులుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కమల్‌కుమార్, సిఐటియు జిల్లా కార్యదర్శి యర్రం సాయికిరణ్ పిలుపునిచ్చారు. ప్రజా సంఘాల సంయుక్త సమావేశం సుందరయ్య భవనంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో సుజాత అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమల్‌కుమార్, సాయికిరణ్ మాట్లాడుతూ నేడు పాలకుల వైఖరి వల్ల ప్రజల జీవితాలు కష్టాల పాలవుతున్నాయన్నారు. ఉపాధి దొరకడమే గగనమైపోతుందన్నారు. చదువుకున్న యువత సైతం చాలీచాలని జీతాలకు పని చేస్తున్నారన్నారు. పాలకులు మాత్రం కార్పొరేట్ శక్తుల ప్రాపకం కోసం ప్రజల జీవితాలను పణం పెట్టేవారికి అనుకూలమైన చట్టాలు చేస్తున్నారన్నారు. ప్రశ్నించే గొంతుకలు నొక్కేస్తున్నారన్నారు. పాలకుల విధానాలను ప్రశ్నించేందుకు సరైన వేదికలు చట్ట సభలే. ఆ చట్ట సభల్లో ప్రజల సమస్యలు లేవనెత్తి పరిష్కారించేవారినే మనం గెలిపించుకోవాలన్నారు. మనందరి తరఫున నికరంగా నిలబడినవారు పిడిఎఫ్ ఎంఎల్‌సిలేనన్నారు. ఈ నెల 27వ తేదీన జరగనున్న ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డిడ్ల వీరరాఘవులును గెలిపించాలన్నారు. పలు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సంఘాలు బలపరుస్తున్నాయన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యర్రంశెట్టి నాగేంద్రరావు, యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బానారి బాలకృష్ణ, సిఐటియు మండల ఉపాధ్యక్షులు షేక్ వలీపాషా, సహాయ కార్యదర్శి కాకర్ల శ్రీను, యుటిఎఫ్ మండలాధ్యక్షులు నాగేశ్వరరావు, నాయకులు కాసిం బి పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి రాఘవులుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని రైతు సంఘం మండల కార్యదర్శి సిరిబత్తుల సీతారామయ్య విజ్ఞప్తి చేశారు. రాఘవులును గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తూ మండలంలోని కామయ్యపాలెం, పి.అంకంపాలెం, పి.నారాయణపురం గ్రామాల్లో ప్రచారం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సమస్యలపై పోరాడే పిడిఎఫ్ అభ్యర్థిని గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కార్యదర్శి సిహెచ్.కొండలరావు, జగదీష్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గుంటూరు తరలిన ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఎంఎల్‌సి ఉమ్మడి కృష్ణ, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పిడిఎఫ్ అభ్యర్థిగా కెఎస్.లక్ష్మణరావు గుంటూరులో సోమవారం నామినేషన్ వేశారు. తొలుత గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సభ జరిగింది. ఈ సభలో వివిధ ఉద్యోగ, కార్మిక, ఉపాధ్యాయ, వేలాది మంది ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం ప్రదర్శనగా వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి నూజివీడు నుంచి వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ఇతర ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు వంద మందికిపైగా తరలివెళ్లారు. సభ, ప్రదర్శతో జరిగిన నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

13 నుంచి శిక్షణ తరగతులు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలవ్యాప్తంగా జరిగిన పీసా కమిటీ ఎన్నికల్లో గెలుపొందిన ఉపాధ్యక్షులకు, కార్యదర్శులకు, సర్పంచులకు ఎంపిపి, జెడ్‌పిటిసి, ఎంపిటిసి సభ్యులకు, సచివాలయ సిబ్బందికి ఈ నెల 13 నుంచి 20వ తేదీ వరకు మండల స్థాయి పీసా శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ కె.వెంకటలక్ష్మి తెలిపారు. ఈ శిక్షణా తరగతులను స్థానిక వెలుగు కార్యాలయంలో, ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. శిక్షణకు వచ్చేటప్పుడు సిబ్బంది ఆధార్ కార్డుతో హాజరు కావాలని ఆదేశించారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలి

12న ధర్నా : కౌలు రైతు సంఘం

ప్రజాశక్తి - చింతలపూడి

గ్రామసభలు నిర్వహించి భూ యజమాని ప్రమేయం లేకుండానే వాస్తవ సాగుదారులను గుర్తించి వారికి కౌలు గుర్తింపు కార్డులు జారీ చేయాలని ఎపి కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దంతా కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చింతలపూడి సిపిఐ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలని ఈ నెల 12వ తేదీన మండల స్థాయిలో జరిగే ధర్నా కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సంబంధం లేకుండా కౌలు చేసే రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, గుర్తింపు కార్డు పొందిన వారికి ఆర్‌బిఐ రూల్స్ ప్రకారం స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రూ.రెండు లక్షల వరకు హామీలేని రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మండల స్థాయిలో జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

150 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని చనుబండ సచివాలయం-1లో శ్రీసత్యసాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నూజివీడు అమెరికన్ హాస్పటల్ కంటి వైద్యులతో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ సత్యసాయి సేవా ట్రస్ట్ విస్సన్నపేట ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఉచిత కంటి వైద్య శిబిరాల ద్వారా సేవలందించడం అభినందనీయమన్నారు. ఈ కంటి వైద్య శిబిరంలో 150 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. 50 మందికి శుక్లాల ఆపరేషన్ అవసరం కాగా నూజివీడు ఆసుపత్రికి తరలించారు. అవసరమైనవారికి మందులు అందించారు. కొంతమందికి అవసరమైన కళ్లద్దాలు డాక్టర్లు సిఫార్సు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి విస్సంపల్లి జ్యోతి, గవర వెంకటేశ్వరరావు, శ్రీ సత్యసాయి సేవా ట్రస్ట్ విస్సన్నపేట సభ్యులు, శ్రీ సత్యసాయి భజన మండలి చనుబండ సభ్యులు, కంటి రోగులు పాల్గొన్నారు.

రోడ్డు అధ్వానం.. తరచూ ప్రమాదాలు..!

ప్రజాశక్తి - కుక్కునూరు

ప్రమాదంలో ధ్వంసమైన కారు

మండలంలో 45 కిలోమీటర్ల మేర తవ్వి వదిలేసిన రోడ్డుపై తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో ఆ రోడ్డుపై ప్రయాణించేందుకు వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. సోమవారం మారేడుబాకలో కారు, బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలపాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఇదేవిధంగా ఆదివారం కూడా కివ్వాకలో కారు బోల్తా పడింది. కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులకు ఎటువంటి గాయాలు కాకపోవడంతో ప్రమాదం తప్పింది. ఒక ప్రమాదం జరిగి 24 గంటలు గడవకముందే మరో ప్రమాదం జరిగినా అధికారులు స్పందించడంలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. అశ్వారావుపేట నుంచి కుక్కునూరు మీదుగా భద్రాచలం వెళ్లే రోడ్డుపై దుమ్ము లేచి ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా రహదారి పనులు చేపట్టి పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

యర్రగుంటపల్లి అభివృద్ధికి సాంబశివరెడ్డి కృషి ఎనలేనిది

వర్ధంతి కార్యక్రమంలో చింతలపూడి ఎంఎల్ఎ రోషన్‌కుమార్

ప్రజాశకి - చింతలపూడి

యర్రగుంటపల్లి అభివృద్ధికి టిడిపి నేత సాంబశివరెడ్డి చేసిన కృషి ఎనలేనిదని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. మండలంలోని యర్రగుంటపల్లి గ్రామంలో మాజీ సర్పంచి తాళ్లూరి సాంబశివరెడ్డి 11వ వర్ధంతి కార్యక్రమంలో ఎంఎల్ఎ పాల్గొన్నారు. సాంబశివరెడ్డి విగ్రహానికి సాంబశివరావు సతీమణి రాధారాణి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి మాజీ ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి, మాజీ జెడ్‌పిటిసి తాళ్లూరి రాధారాణి, గోలి శాంతారెడ్డి, వైవి.సత్యనారాయణ, రామాంజనేయచారి, వడ్లమాని వెంకటేశ్వరరెడ్డి, విజయభాస్కర్, రవి, శ్రీను, ఎస్‌కె.బాజీ, పైడిమర్ల రవిచంద్రారెడ్డి, అంజయ్య, జగదీశ్వర్‌రెడ్డి, గారపాటి సత్యనారాయణ, కుప్పాల సోమయ్య, టిడిపి కార్యకర్తలు, ప్రజలు, పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహుడు కళ్యాణం

పట్టు వస్త్రాలను సమర్పించిన ఎంఎల్ఎ వెంకటరాజు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

మండలంలోని వైఎస్.జగన్నాధపురం గ్రామంలో కొండపై ఉన్న స్వయంభూ శ్రీలక్ష్మీ నరసింహ స్వామి దివ్య కళ్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు, ఆలయ ఫౌండర్ ట్రస్ట్ సభ్యులు నివృత్తిరావు స్వామివారికి సాంప్రదాయ బద్ధంగా పట్టు వస్త్రాలను సమర్పించారు. శ్రీవారి ప్రధాన దేవాలయానికి దత్త దేవాలయమైన ఐఎస్.జగన్నాధపురం లోని సుందరగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయంలో ఈ నెల ఎనిమిదో తేదీ నుంచి ప్రారంభమై కళ్యాణోత్సవాలు 12వ తేదీతో ముగియనున్నట్లు ఆలయ ఇన్‌ఛార్జి ఇఒ వేంద్ర త్రినాధరావు తెలిపారు. కళ్యాణోత్సవం సందర్భంగా ఆలయానికి అధిక సంఖ్యలో యాత్రికులు తరలివచ్చారు. దాతలు ఏర్పాటుచేసిన శ్రీ స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. టిడిపి మండలాధ్యక్షులు లంక సత్యనారా యణ, మండల నాయకులు పోలిన శ్రీనివాస్, దేవరపల్లి వీరస్వామి చౌదరి, మొగతడకల ఓం ప్రకాష్, యేపూరి దాలయ్య, కిషోర్, యిమ్మడి రత్నాజీ, మట్టపర్తి రూపేష్ కుమార్, రేగంటి రాంబాబు, మాసిరెడ్డి గంగాధరరావు, దాకారపు నరసింహమూర్తి, కోట అంజిబాబు, జుత్తిగ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల పని వేళలు తెలిపే

నోటీసు బోర్డులు ఏర్పాటు చేయాలని వినతి

మండవల్లి : పంచాయతీలో కార్యదర్శి పాత్ర ఎంతో ముఖ్యమని, కార్యదర్శులు లేక పనులు సాగక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు స్పష్టం చేశారు. కార్యదర్శులు పంచాయతీల్లో అందుబాటులో ఉండే సమయాలను తెలియజేసే విధంగా నోటీసు బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతూ ఎంపిడిఒ రామలింగేశ్వరకు, ఇఒ సిహెచ్.శేఖర్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ భాస్కరరావు మాట్లాడుతూ మండలంలో 29 గ్రామ పంచాయతీలకు కేవలం 12 మంది కార్యదర్శులే ఉన్నారన్నారు. అందులో గ్రేట్ 5లు 7 మాత్రమేనన్నారు. ఒక్కొక్క కార్యదర్శి ఏడు లేదా ఎనిమిది గ్రామాలకు ఇప్పటికే విధులు నిర్వహిస్తుండగా ముగ్గురు కార్యదర్శులు సెలవుల్లో ఉండడంతో మిగతా కార్యదర్శులపై మరింత భారం పడిందన్నారు. దీంతో ఏ కార్యదర్శి ఏ గ్రామంలో ఏ సమయంలో ఉంటారో తెలియక సర్టిఫికెట్లు, వివిధ పనుల కోసం ప్రజలు పంచాయతీ కార్యాలయం వద్ద పడిగాపులు పడాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. కార్యదర్శులు ఎక్కడ విధులు నిర్వహిస్తున్నారనేది సర్పంచులకు కూడా తెలియని పరిస్థితి నెలకొందన్నారు. మండవల్లి మేజర్ పంచాయతీలో కార్యదర్శి అందుబాటులో లేకపోవడంతో పాలన సజావుగా సాగడం లేదన్నారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను తొలగించే విధంగా నోటీసు బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన ఇఒపిఆర్‌డి శేఖర్ మాట్లాడుతూ కార్యదర్శుల పనివేళలు తెలిపే విధంగా బోర్డులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ టి.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కాపు సంఘం మండల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి -ముదినేపల్లి

జాతీయ కాపు సంఘం ముదినేపల్లి మండల కార్యవర్గం సోమవారం ఎన్నికైనట్లు ఆ సంఘం కైకలూరు నియోజకవర్గ అధ్యక్షులు బెల్లంకొండ వెంకన్న బాబు తెలిపారు. ముదినేపల్లి మండలాధ్యక్షులుగా పోకల దేవేంద్ర గోపాలకృష్ణ, ఉపాధ్యక్షులుగా వడ్లని ఆంజనేయులు, సుధాబత్తుల వెంకట రమణ, కోశాధికారిగా దాసరి ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శులుగా అబ్బిశెట్టి నరేష్, అల్లాడి సతీష్ లను నియమించినట్లు బెల్లంకొండ వెంకన్న బాబు తెలిపారు.

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, నరసాపురం మండలం, నరసాపురం మున్సిపల్ ఏరియా, 6వ వార్డు, జంపావారి వీధి, డోర్ నెం. 3-4-10 రు నివాసి మోచర్ల సత్యకృష్ణ గారి కుమార్తె మోచర్ల మైత్రి నాగ తన్మయ తెలియజేయునది ఏమనగా ది. 10-02-2025వ సం॥రం తేదిన I.E.L.S. Online Exam కొరకు విజయవాడ వెళ్ళుటకు నా తాలూకు సర్టిఫికేట్, పాస్‌పోర్ట్ జిరాక్స్ తీయించుటకు మా ఇంటి వద్ద నుండి వెళ్తుండగా నా కవరులో నుండి నా తాలూకు పాస్‌పోర్టు నెం. V4404121 ఎక్కడో పడిపోయినది. మార్గ మధ్యంలో ఎంత వెతికినను దొరకలేదు. కావున ఈ ప్రకటన ద్వారా నేను తెలియజేయునది ఏమనగా ఎవరికైనను నా పాస్‌పోర్ట్ దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు తెలియజేయవలసినదిగా కోరుచున్నాను.

నరసాపురం, ది. 10-02-2025.

మోచర్ల మైత్రి నాగ తన్మయ
D/o. సత్యకృష్ణ
డోర్ నె. 3-4-10, జంపావారి వీధి
నియర్ రైతు బజార్
నరసాపురం - 534 275, ప.గో.జిల్లా.
మొబైల్ నెం: 98662 59514

ప్రకటన

మహారాజశ్రీ పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం 10వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
A.S.No.8/2020

Between:
సాకా మోహనరావు ...అప్పిలెంట్
మరియు
సాకా నారాయణరావు వగైరా ...రెస్పాండెంట్లు

టు:
6వ రెస్పాండెంట్: శ్రీమతి గొల్ల రాజమణి, భర్త: హేమ చంద్రబాబు, C/o. జాన్ ఫ్రెడిక్, మట్లపాలెం, వయా దొడ్డిపట్ల, యలమంచిలి మండలం, ప.గో.జిల్లా

పై నంబరు అప్పీలులో 6వ రెస్పాండెంటు అయిన మీకు ఎన్నిసార్లు సమన్లు పంపించిననూ మీరు అందుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున ఇందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా పై నంబరు అప్పీలు మీ హాజరు నిమిత్తం **తేదీ. 24-02-2025 సం.రం. తేదీ** నాటికి వాయిదా అయి వున్నది. సదరు తేదీ నాడు మీరు స్వయంగా గాని, అడ్వకేట్ గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట **ఉదయం 10-30 గంటలకు** పై హాజరై సంజాయిషీ తెలుపుకోవలెను. లేని యెడల మీ పరోక్షమున అప్పీలు తీర్మానం చేయబడునని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

పోలిశెట్టి వీర వెంకట నారాయణ స్వామి
నరసాపురం అడ్వకేట్
ది.09-2-2025 నరసాపురం, ప.గో.జిలా
సెల్ నెం. 98660 94606

మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో, నరసాపురం
F.D.I.A. No. 06/2021 in O.S. No. 68/2018

బిట్వీన్:
గాదె వెంకట శివరామ్ ...పిటీషనర్
అండ్
పిల్లా హేమలత ...రెస్పాండెంట్

రెస్పాండెంటుకు నోటీసులు:
పిల్లా హేమలత, W/o. నర్సింహరావు, డోర్ నెం. 1-26, అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

మీరు పిటీషనర్ గాదె వెంకట శివరామ్ గారికి చెల్లించవలసిన బాకీ, చెల్లించనందున మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) నరసాపురం వారి కోర్టులో పై నెంబరు వ్యాజ్యము దాఖలు చేసియున్నారు. సదరు వ్యాజ్యములో శ్రీ కోర్టు వారి ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా నోటీసులు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా **ది. 20-02-2025 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున సదరు వ్యాజ్యము విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియచేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 10-02-2024 సెల్: 98662 59514

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం 2వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో, తాడేపల్లిగూడెం
ఇ.పి.నెం.9/2024 ఇన్ ఓ.ఎస్.నెం.212/2022

బిట్వీన్:
రెడ్డి సత్యనారాయణ
...డి.హెచ్.ఆర్ /ప్లెయింటిఫ్
మద్దుకూరి నాగేశ్వరరావు
...జె.డి.ఆర్ /డిఫెండెంట్

శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ఆస్థి వేలం ప్రకటన

పై నెంబరు డిక్రీ బాకీ గాను ప్రతివాది /జె.డి.ఆర్ తాలూకు ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థి **ది. 20-02-2025 వ తేదీన ఉదయం గం॥10:30 ని॥ల లగాయతు పై కోర్టులో వేలం వేయబడును.** షరతులు తెలుసుకొని పాడుకొనవలెను.

షెడ్యూలు: పశ్చిమ గోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం మండలం, జగన్నాదపురం గ్రామం తాలూకు వ్యవసాయ భూమి bearing R.S.No.115 to an extent of Ac.0-60 Cents of Agriculture land bounded by:
East: Talla Venkateswarao's Land.
South: Maddhukuri Ramarao's Land.
West: Land of Siddhina Sirisha.
North: Siddhina Venkataswararao's Land. & Etc., Land.

పై హద్దుల మధ్య య.0-60 సెంట్లు గల వ్యవసాయ భూమి సమస్త ఈజుమెంటు హక్కులతో సహా.
వాది /డి.హెచ్.ఆర్ వాల్యూ /కిమ్మత్తు : రూ.10,00,000/-
అమీనా వాల్యూ /కిమ్మత్తు : రూ.20,00,000/-

MUTYALA SUNIL KUMAR
Advocate for D.H.R.
Tadepalligude.